నష్టాల బాటలో బుడ్డశనగ రైతులు

- ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల దిగుబడులు
- పెట్టుబడులు ఎకరాకు రూ.25 వేలకుపైనే
- మార్కెట్‌లో తగ్గిన బుడ్డశనగ ధరలు
- ఆవేదన చెందుతున్న రైతులు


బుడ్డశనగ పంటను పీకి వేసిన రైతులు

వేముల : ఈ ఏడాది బుడ్డ శనగ రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. రబీ సీజన్‌లో పులివెందుల నియోజకవర్గంలో ప్రధాన పంటగా బుడ్డశనగ సాగవుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది ఎకరాలలో రైతులు శనగ పంటను సాగు చేసుకున్నారు. సాగులో పెట్టుబడులు పెరిగిపోయి దిగుబడులు తగ్గడంతో రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్‌లో సకాలంలో వర్షాలు లేక పంటలు సాగు కాలేదు. అరకొర వర్షాలకు పంటలు సాగు చేసిన అనంతరం వర్షాభావంతో పంటలు ఎండిపోయాయి.

ఎకరాకు రూ.25 వేలకుపైనే పెట్టుబడులు

ఈ ఏడాది బుడ్డశనగ సాగులో పెట్టుబడులు పెరిగిపోయాయి. రూ.25 వేలకుపైనే పెట్టుబడులు పెట్టారు. పంట సాగు సమయంలో విత్తనాలు, ఎరువులు, సేద్యాలు ఖర్చులు అయ్యాయి. సాగు అనంతరం పంటకు తెగుళ్లు సోకకుండా ముందు జాగ్రత్తగా మందులు పిచికారి చేశారు. పంటలో దిగుబడులు వచ్చే సమయానికి 4 నుంచి 5 సార్లు మందులను స్ప్రే చేశారు. ఇందుకు అదనపు ఖర్చు కావడంతో పెట్టుబడులు పెరిగిపోయాయని రైతులు అంటున్నారు.

నియోజకవర్గంలో 40 వేల ఎకరాలలో సాగు

పులివెందుల నియోజకవర్గంలో బుడ్డశనగ 40 వేల ఎకరాలకుపైనే సాగైందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, వేముల, లింగాల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగా.. పులివెందుల, చక్రాయపేట మండలాల్లో తక్కువగా రైతులు సాగు చేసుకున్నారు. ప్రతి ఏడాది 60వేల ఎకరాలలో సాగయ్యేది.


బుడ్డశనగను మిషన్‌కు వేస్తున్న రైతులు

ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల దిగుబడులు :

రబీలో ఆశించిన మేర దిగుబడులు అందలేదు. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లకు మించి దిగుబడులు రాలేదని రైతులు వాపోతున్నారు. రబీలో అక్టోబర్ చివర, నవంబర్ మొదటి వారాల్లో శనగ పంటను సాగు చేశారు. సాగు అనంతరం మూడు తుఫాన్ల ప్రభావంతో వర్షాలు కురిశాయి. దీంతో శనగ పంట పూత దశలో ఉండగా వర్షాలు రావడంతో పంట దెబ్బతింది.

మార్కెట్‌లో తగ్గిన బుడ్డశనగ ధరలు :

సాగు సమయంలో క్వింటా బుడ్డ బుడ్డశనగలు రూ.7 వేలకుపైనే ధరలు ఉండేవి. సాగు చేసేందుకు క్వింటా రూ.7వేలతో కొనుగోలు చేశామని రైతులు అంటున్నారు. మార్కెట్‌లో క్వింటా బుడ్డశనగలు రూ.5,500లకు మించి ధరలు లేవని.. ధరలు తగ్గడంతో క్వింటాపై రూ.2వేలు నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

సాగులో నష్టపోతున్నాం

రబీపై ఆశలు పెట్టుకుని బుడ్డశనగ సాగు చేశా. సకాలంలో విత్తనం పడటంతో దిగుబడులు బాగా ఉంటాయని ఆశించాం. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసి పంట దెబ్బతిది. సాగులో దిగుబడులు తగ్గి నష్టపోతున్నాం.

– అంకిరెడ్డి, శనగ రైతు, గొందిపల్లె



పెట్టుబడులు కూడా రావడంలేదు

బుడ్డశనగ సాగులో పెట్టుబడులు కూడా రావడంలేదు. సాగు సమయంలో ఉన్న ధరలు దిగుబడులు వచ్చేసరికి అమాంతం ధరలు తగ్గిపోతున్నాయి. క్వింటాపై రూ.2వేలు ధరలు తగ్గడంతో నష్టాలను చూస్తున్నాం. సాగులో పెట్టుకున్న ఆశలన్ని తుఫాన్ దెబ్బతీసింది.

– రఘునాథరెడ్డి, శనగ రైతు, గొందిపల్లె



భవన నిర్మాణ పనులు ప్రారంభం

పులివెందుల టౌన్ : మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో స్నేహిత అమృత హస్తం సేవా సమితి నూతన భవన నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయని ఆ సమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. భవన నిర్మాణానికి ఎంపీ వై ఎస్ అవినాష్‌రెడ్డి రూ.2 లక్షల విరాళంతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నా రు. ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం, సేవాసమితి కమిటీ బృందం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపా రు. కార్యక్రమంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం రామసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, శివగంగాధ ర్‌రెడ్డి, ఎస్‌ఏహెచ్‌ఎస్ సమితి సభ్యులు బండారురాజు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, మా ల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించండి

సింహాద్రిపురం : పులివెందుల నుంచి తాడిపత్రికి ప్రతిరోజు సాయంత్రం 6:15కు చివరి బస్సు నడుపుతుండేవారు. ఆ బస్సు తప్పితే మళ్లీ రాత్రి 8.30 గంటలకు హైదరాబాద్ బస్సు మాత్రమే ఉంది. ఈ బస్సులో అధిక చార్జీతో ప్రయాణించాల్సి వస్తోంది. కనీసం ప్రయాణికుల సౌకర్యార్థం పులివెందుల ఆర్టీసీ డిపో అధికారులు కనీసం కొండాపురం వరకన్నా రాత్రి 7 గంటలకు పులివెందులలో చివరి బస్సు ఉండేటట్లు చూడాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

జేసీబీ పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పట్టుబడిన జేసీబీ

వేంపల్లె : మండలంలోని పాములూరు గుట్ట సమీపంలో ఆదివారం అక్రమంగా గ్రావెల్ మట్టిని తీస్తున్న జేసీబీని విజిలెన్స్ ఏడీ సుబ్రహ్మణ్యం పట్టుకున్నారు. వేంపల్లె రాయల్టీ ఇన్‌చార్జిలు కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌లతో కలిసి ఆయన అక్రమ గ్రావెల్ మట్టిని తోలుతున్న వారిపై దాడులు నిర్వహించారు. కొందరు టీడీపీ నేతలు పాములూరు గుట్ట సమీపంలో ఆన్‌లైన్ బిల్లులు లేకుండా గ్రావెల్ మట్టిని తోలుతున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా సరే ఆన్‌లైన్‌లో ముందే డిపాజిట్ చెల్లించి రాయల్టీ పర్మిట్లు తీసుకోవాలన్నారు. అలాకాకుండా ఆఫ్‌లైన్‌లో ఉన్న పాత బిల్లులు చూపించి అక్రమంగా తోలుతున్నారని తెలిపారు. అక్రమంగా గ్రావెల్ మట్టిని తీస్తున్న జేసీబీని సీజ్ చేసి వేంపల్లె పోలీసులకు అప్పగించినట్లు ఏడీ తెలిపారు.

నులి పురుగుల నివారణపై ర్యాలీ


వేంపల్లెలో నులి పురుగుల నివారణపై ర్యాలీ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

వేంపల్లె : జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణ వీధుల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు స్వాతిసాయి, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీవున్నీషాలు మాట్లాడుతూ నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, పిల్లల నుంచి పెద్దల వరకు అల్బెండజోల్ మందులు వాడవచ్చునన్నారు. గత మాసంలో జరిగిన మాప్ అప్ డేలో గైర్హాజరైన పిల్లలకు అల్బెండజోల్ 400 ఎంజీ మాత్రలు పంపిణీ చేస్తున్నామన్నారు. 19 ఏళ్లలోపు విద్యార్థులందరికి ఆయా విద్యా సంస్థలలో ఈ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నులి పురుగుల నివారణకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ ఫకృద్దీన్, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ

సింహాద్రిపురం : స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఆదివారం రాత్రి రూరల్ సీఐ వెంకటరమణ వాహనాల తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాటికి జరిమానాలు విధించారు. వాహనదారుడు తప్పనిసరిగా తమ వాహనానికి సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగిన వారిపై కేసు నమోదు చేయడంతోపాటు జరిమానాలు విధిస్తామన్నారు. అలాగే ప్రజలు కూడా అసాంఘిక కార్యకలాపాలపై సమాచారమివ్వాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో లింగాల ఎస్ఐ మధుసూదన్, పోలీసులు పాల్గొన్నారు.

పత్ర సమర్పణతో పలువురి ప్రశంసలు


ప్రొఫెసర్ రవికుమార్‌ను శాలువా, మెమెంటోలతో సత్కరిస్తున్న ప్రముఖులు

వేంపల్లె : ఇడుపులపాయలోని ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జి.రవికుమార్ పత్ర సమర్పణ చేయడంతో పలువురి ప్రశంసలు పొందారు. ఈయన గత 8 ఏళ్లుగా తెలుగు శాఖలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. రెండు రోజులపాటు కడప శంకరాపురంలో వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రెండవ సాహిత్య సాంస్కృతిక మహాసభలు నిర్వహించారు. అందులో రవికుమార్ పాల్గొని ×ఆధునిక రాయలసీమ పద్య కావ్యాలు–రాయలసీమ విశిష్టత×అనే అంశంపై పత్ర సమర్పణ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి వీరిని శాలువా, ప్రశంసాపత్రంతో సత్కరించారు. అనంతరం కవి సమ్మేళనంలో కూడా పాల్గొని ×సీమ ఘనత్వ×అంశంపై కవితాగానం చేశారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తాతోపాటు అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

ఘనంగా హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

మము కరుణించరావా శ్రీవేంకటరమణ

పులివెందుల టౌన్ : పులివెందులలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం 6వ రోజు స్వామివారు ఉదయం పల్లకిలో మోహినీ ఉత్సవం నిర్వహించారు. రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అలంకారంలో స్వామివారు దివ్య మంగళ స్వరూపంతో వెలిగిపోతూ కనిపించారు. స్వామివారిని భక్తులు అద్దంలో చూచి తరించారు. పట్టణ పురవీధులైన మెయిన్ బజార్, పూల అంగళ్ల సర్కిల్, ముత్యాల వారివీధి, గాడిచర్ల వీధి, అమ్మవారిశాల పురవీధులలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. కాయకర్పూరాలను సమర్పించారు. ముందుగా ఆలయంలో సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, నివేదన, నిత్య హోమం, కలశారాధన, బలిహరణం ఇత్యాది పూజలను చేసి హారతి, తీర్థప్రసాదాల వినియోగం చేపట్టారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవలో ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు.


పల్లకిలో అద్దంలో కనిపిస్తున్న మోహినీ అలంకారంలో శ్రీవారు

నేడు కల్యాణం

శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజు సోమవారం ఉదయం హనుమద్వాహనం, సాయంత్రం శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించి అనంతరం గజవాహనంపై పురవీధులలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం

లింగాల : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో, పాఠశాలల్లో, కళాశాలల్లో 4160 మందికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొంటారన్నారు. దీన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండలం నవాబుపేటలో మూలపెద్దమ్మ ఆలయంలో ఘనంగా విగ్రహ ప్రతిష్టను నిర్వహించారు. అనంతరం మోరగుడి గ్రామస్తులచే కోలాటం కార్యక్రమం, చిన్నకొమెర్ల వారిచే తాళాల భజన నిర్వహించారు. ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి విగ్రహ ప్రతిష్టకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయన సన్మానించారు. ఈ ఆలయ నిర్మాణానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1.25 కోట్లు మంజూరు చేయడంతో గుడిని నిర్మించారు. యర్రబోలు శివ బాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డిలు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందించడంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో అయన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు.

గ్రీన్ హైవే పనులకు అడ్డుకట్ట

బ్రహ్మంగారిమఠం : దుమ్ముతో తమ పంటలు నష్టపోతున్నామని చెబుతూ మండలం లోని మల్లేపల్లెలో జరుగుతున్న గ్రీన్ హైవే రోడ్డు పనులు రైతుల అడ్డుకున్నారు. హైవే వద్దకు చేరుకుని ఆదివారం పనులు నిలిపివేయించారు. రైతుల వివరాల మేరకు.. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్‌కు చెందిన 600, మరింతమంది రైతులకు చెందిన దాదాపు 300 సన్న నిమ్మచెట్లు గ్రీన్‌హైవే రోడ్డుకు సమీపంలో ఉన్నాయి. ఇటీవల హైవే విస్తరణ పనుల కోసం అధిక సంఖ్యలో టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ దుమ్ము, ధూళికి తాము సాగు చేసిన సన్న నిమ్మ పంట దిగుబడులు రావడంలేదని రత్నకుమార్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము నివారణా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టర్ ప్రతినిధులకు చెబుతున్నా స్పందించడం లేదన్నారు. దాదాపు రూ.6 లక్షలు నష్టపోయే అవకాశం ఉందని, అందుకే రైతులతో కలిసి పనులు నిలిపివేయించామని తెలిపారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ

వేంపల్లె : జిల్లా లేబర్ ఆఫీస్ సంక్షేమ బోర్డు నుంచి అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఆదివారం అందజేశామని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.రామాంజనేయులు, కోశాధికారి నాగేశ్వర రావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి వచ్చే పథకాలకు సంబంధించి ఈ గుర్తింపు కార్డు ద్వారా చాలా ఉపయోగాలు ఉన్నాయన్నారు. కార్మికులు పనిచేసేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే సంక్షేమ బోర్డు నుండి పరిహారం అందిస్తామన్నారు. ఇంకా ఎవరైనా గుర్తింపు కార్డులేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. అలాగే విశ్వకర్మ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా భవన నిర్మాణ కార్మికులకు ట్రైనింగ్ ఇచ్చి రుణాలు ఇవ్వాల్సిన బాధ్యత బ్యాంకు అధికారులకు ఉన్నప్పటికీ ఎస్‌బీఐ బ్యాంకు మాత్రం ఇవ్వడంలేదని, తక్షణమే అధికారులు స్పందించి బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ పులివెందుల ఇంచార్జ్ ఏఎల్‌ఓ అల్లాబకాష్, మండల ఉపాధ్యక్షుడు దస్తగిరి, కార్యనిర్వాక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులను అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

వేంకటరమణుడికి పట్టు వస్త్రాలు సమర్పణ

పులివెందుల టౌన్ : వేంకటరమణుడి బ్రహ్మోత్సవాలలో భాగంగా గరుడ సేవ రోజున చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టు వస్త్రాలను తీసుకొచ్చి సమర్పించారు. ఆయనకు ఆలయ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను తిరుమల తరహాలో జరపడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది గరుడ సేవ రోజున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి ఉయ్యాలవాడ నరసింహారెడ్డితోపాటు రెడ్ల దినచర్ల పుస్తకాన్ని అందించారు. త్వరలో ఏర్పాటు చేసే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు మిట్టా కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీవేంకటరమణుడికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ఘనంగా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామంలో ఆదివారం శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కొనసాగుతున్న భాగవత పఠనం ఆదివారం చివరి రోజు కావడంతో శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ ఊరేగింపు శ్రీరామాలయం నుంచి బస్టాండు వరకు, బస్టాండు నుంచి ఆలయం వరకు భజనల మధ్య కలశ ప్రదర్శన సాగింది. అనంతరం భాగవత పండితులు పులివెందుల శ్రీరంగనాథస్వామి ఆలయ నూతన క్యాలెండర్లను భక్తులకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భక్త సమాజ మండలి సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు.. ప్రకృతికి ముప్పు


కనంపల్లె కొండలో నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

పులివెందుల రూరల్ : మండలంలోని కనంపల్లె సమీపంలో అడవులకు నిప్పు పెట్టడంతో ప్రకృతికి ముప్పు వాటిల్లుతోంది. సాధారణంగా అడవులు ఏపుగా పెరిగితే వర్షాలు బాగా పడే అవకాశం కూడా ఉంటుంది కానీ కొంతమంది వ్యక్తులు అడవులకు నిప్పు పెట్టడంవల్ల వర్షాలు రాకుండా పోతున్నాయి. అంతేకాకుండా మూగజీవాలకు మేత కూడా కరువైపోతుంది. అదే రూట్‌లోని కనంపల్లె గ్రామ సమీప కొండలలో గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టారు. దీంతో అడవి మొత్తం కాలుకుంటూ పోతోంది. సుమారు నాలుగైదు కిలోమీటర్ల మేర అడవికి నిప్పు పెట్టడంవల్ల గడ్డి అంతా కాలిపోతూ ఉంది. దీంతో మేకలు, పశువులు, ఆవులు కొండ ప్రాంతానికి తీసుకొని వచ్చే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవికాలం కావడంతో కొండ ప్రాంతాల్లో ఉన్న గడ్డి కూడా ఎండిపోతోంది. దీనికితోడు కొంతమంది వ్యక్తులు కొండలకు అగ్గిపెట్టడంతో ఉన్న గడ్డి కాస్తా కాలిపోతుంది. సంబంధిత ఫారెస్ట్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొండ ప్రాంతాలకు నిప్పు పెట్టే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

మండల సమగ్ర అభివృద్ధికి చర్యలు

చింతకొమ్మదిన్నె : మండల పరిషత్ సభా భవనంలో ఆదివారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండల అధ్యక్షురాలు లక్ష్మీప్రసన్న మండల సమావేశ ప్రారంభంలోనే వెళ్లడంతో ఉప మండలాధ్యక్షుడు జి.వి.సుధాకరరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ ముఖ్యంగా రానున్న వేసవికి నీటి ఎద్దడి, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వ్యవసాయ అధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతు తప్పకుండా భూ ఆధార్/ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మాట్లాడుతూ గండికోట నుంచి వెల్లటూరు మీదుగా అన్ని గ్రామాలకు శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించే విధంగా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఏఈ వేణుగోపాల్‌పై వివిధ పంచాయతీ సెక్రెటరీలు ఫిర్యాదులు చేశారు. పంచాయతీ అధికారుల నుండి ఎన్వోసీ లేకుండా నూతన గృహాలకు మీటర్లు బిగించరాదని కోరారు. ఎంఈఓ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలను రీఆర్గనైజేషన్ చేసిన కారణంగా మండలంలో 11 మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేసినట్లు, వీటిలో కొన్నింటికి 15 రూములు అవసరం కాగా ఐదు రూములు మాత్రమే ఉన్నట్లు, భవన నిర్మాణాలకు స్థలాల కొరత ఉన్నట్లు తెలిపారు. ఎంపీడీఓ కుల్లాయిబాబు మాట్లాడుతూ సమావేశంలో చర్చ జరిగిన వివిధ అంశాలకు సంబంధించి తీర్మానాలను తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. సమావేశంలో బాలుపల్లి సర్పంచ్ సురేంద్రారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఉపాధి హామీ ఏవో రామాంజనేయరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కోలా ప్రసాద్ సహకారంతో మదనపల్లె సూర్య డ్యాన్స్ అకాడమీ మాస్టర్ సూర్యల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామ సిబ్బంది పాల్గొన్నారు.


సినిమా పాటకు నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నేటి నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పాపాఘ్ని నది ఒడ్డున మండలంలోని పైడికాలువలో వెలసిన శ్రీ రాజ్య లక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలను సోమవారం నుండి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 10 వ తేదీన గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 10 వ తేదీన సాయంత్రం భరత నాట్యం, ఫోక్ సాంగ్స్ కార్యక్రమాలు జరుగుతాయి. రాత్రి 9 గంటలకు కోలాటం, చెక్క భజన కార్యక్రమాలు జరుగుతాయి. 11 న మధ్యాహ్నం కోలాట ప్రదర్శన వుంటుంది. సాయంత్రం కూచిపూడి నృత్యం జరుగుతుంది. 12 న ఉదయం 9 గంటలకు కోలాట ప్రదర్శనలు వుంటాయి. రాత్రి 8 గంటలకు సినీ, మాటీవీ ఆర్టిస్టులచే సంగీత విభావరి, మిమిక్రీ , సినీ, డ్రామా, రేలా రేలారే జానపద కార్యక్రమం వుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయాన్ని స్వామి హరి నారాయణ ఆధ్వర్యంలో 2007లో జీర్ణోద్ధరణ గావించబడి పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. అప్పటి నుండి ప్రతి శనివారం రాహుకాలం నందు సర్వదోష నివారణా పూజలు, స్వామి వారికి పంచామృతాభిషేకాలతో భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా ఖ్యాతిగాంచింది. అంచలంచెలుగా అభివృద్ధి చెందుతున్న ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ త్రయోదశి నుండి పౌర్ణమి వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.


శ్రీ చెన్నకేశవ స్వామి మూల విరాట్


శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం